రేపు కుమ్మర్ల తొలి బోనాలు

అంబర్‌పేట, జూలై 5 : ఆషాఢ బోనాల సందడి హైదరాబాద్‌లో ప్రారంభం కానుంది. ఈ నెల 7న కుమ్మర్ల తొలి బోనాల జాతరను నిర్వహించనున్నట్లు బోనాల జాతర వ్యవస్థాపకులు రేపాక రాంబాబు, సిలివేరు వెంకటేశ్ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ట్యాంక్‌బండ్ కనకాల కట్టమైసమ్మకు ఆనవాయితీగా వస్తున్న 501 బోనాలను నైవేద్యంగా సమర్పించనున్నట్లు తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం ప్రారంభం కానున్న కార్యక్రమంలో కుమ్మర్లందరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. బోనాలను బిందెల్లో కాకుండా కుండల్లో చేయాలన్నారు. రాష్ట్రంలో అమ్మవారి ఆలయాల్లో కుమ్మర్లనే పూజారులుగా నియమించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

'స్కూల్ బస్సు, ఆటోల్లో పరిమితి మించి తీసుకెళ్లద్దు'

స్కూల్ బస్సు, ఆటోల్లో పరిమితికి మించి విద్యార్థులను తీసుకెళ్ల రాదని కాచిగూడ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఎ.శ్రీనివాస్ స్కూల్ యాజమాన్యం, డ్రైవర్లకు సూచించారు. శుక్రవారం కాచిగూడలో స్కూల్ బస్సులు, ఆటోలపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ.. నిబంధనలు పాటించాలని, సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయరాదని సూచించారు. కార్యక్రమంలో ఏఎంవీఐ రజని, జాకీర్‌హుస్సేన్, విజయుడు, బాలరాజు, బిక్షం,రాంరెడ్డి, జామోలిద్దిన్,విష్ణు పాల్గొన్నారు.

- కాచిగూడ

ప్రతి శుక్రవారం డ్రై డే ను పాటించాలి

అబిడ్స్ : అవగాహన ర్యాలీలో పాల్గొన్న జాంబాగ్ కార్పొరేటర్ రాకేశ్ జైస్వాల్

అంబర్‌పేట : మాట్లాడుతున్న కార్పొరేటర్ పద్మవెంకటరెడ్డి

కాచిగూడ : అవగాహన కల్పిస్తున్న మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మనోజ్‌రెడ్డి

అంబర్‌పేట, జూలై 5 : ప్రతి ఒక్కరూ ప్రతి శుక్రవారం డ్రై డే ను పాటించాలని బాగ్‌అంబర్‌పేట కార్పొరేటర్ బి.పద్మవెంకటరెడ్డి అన్నారు. జీహెచ్‌ఎంసీ అర్బన్ మలేరియా విభాగం ఆధ్వర్యంలో దోమల నివారణ కోసం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన కార్పొరేటర్ మాట్లాడుతూ.. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. విద్యార్థులకు దోమల నివారణ పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వందన, ఎంటామాలజీ సూపర్‌వైజర్ రాఘవేంద్ర పాల్గొన్నారు.

కాచిగూడ : పరిసరాల శుభ్రతతోనే డెంగ్యూ నివారించవచ్చని యూపీహెచ్‌సీ అర్‌హెచ్‌ఎఫ్‌డబ్లూటీసీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మనోజ్‌రెడ్డి సూచించారు. నారాయణగూడలోని మాడపాటి హనమంత్‌రావు స్కూల్‌లో డెంగ్యూ నివారణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. డాక్టర్ మనోజ్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రతి శుక్రవారం డ్రై డేను పాటించాలని సూచించారు. ఇల్లు, వీధి, బస్తీలు, పాఠశాలలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని పేర్కొన్నారు. నీరు నిల్వలు లేకుండా జాగ్రత్త వహించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంటామాలజిస్ట్ డాక్టర్ రాంబాబు, శ్రీనివాస్ రెడ్డి, విజితారెడ్డి, నరేందర్‌రెడ్డి, గాయత్రి, సంధ్య పాల్గొన్నారు.

అబిడ్స్ : జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో జాంబాగ్ డివిజన్ పరిధిలోని వి.వి. ప్రైమరీ పాఠశాలలో డెంగ్యూ, మలేరియాను అరికట్టడానికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జాంబాగ్ కార్పొరేటర్ రాకేశ్ జైస్వాల్ పాల్గొని మాట్లాడుతూ.. దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని కోరారు. వర్షా కాలంలో దోమలు వృద్ధి చెందుతాయని వీటిని నివారించేందుకు గాను గుడ్లను నిర్వీర్యం చేయాలన్నారు. ఫాగింగ్ చేపట్టాలని అధికారులను కోరారు. రేణుక, అమరాజా జోషి, రాజు, డాక్టర్ సుభాష్, రామకృష్ణ, దిలీప్, రాజశేఖర్, ప్రవీణ్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

వాటర్‌వర్క్స్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

అబిడ్స్, జూలై 5 : వాటర్ వర్క్స్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి పాటు పడుతున్నట్లు వాటర్ వర్క్స్ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు జి.రాంబాబు యాదవ్ పేర్కొన్నారు. రాంబాబు యాదవ్ పుట్టినరోజు వేడుకలను గోషామహల్ యూనియన్ కార్యాలయంలో నిర్వహించారు. రాంబాబు యాదవ్ మాట్లాడుతూ.. ఉద్యోగుల సమస్యలను తెలుసుకుని అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. సలహాదారులు షకీల్, చీఫ్‌వర్కింగ్ ప్రెసిడెంట్ నారాయణ, వర్కింగ్ ప్రెసిడెంట్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. యూనియన్ అధ్యక్షుడు రాంబాబు యాదవ్ నేతృత్వంలో అధికారులు, ఉద్యోగులు సమస్యలను పరిష్కరించేందుకు పాటు పడుతున్నామన్నారు. ఈ సందర్భంగా రాంబాబు యాదవ్‌ను సన్మానించారు. కార్యక్రమంలో కొమురయ్య, సయ్యద్ షబ్బీర్, అంజయ్య, జనార్దన్, ప్రేమ్, యాదగిరి, వేణుగోపాల్, నరసమ్మ, జి.సత్యనారాయణ పాల్గొన్నారు.

వాటర్ వర్క్స్ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు రాంబాబు యాదవ్‌ను సన్మానించిన వర్కింగ్ ప్రెసిడెంట్ లక్ష్మీనారాయణ, షకీల్, నారాయణ, కొమురయ్య

ఆహార నియమాలు పాటించాలి

గోపాలకృష్ణ గోఖలేను సన్మానిస్తున్న ఎమ్మెల్యే ముఠాగోపాల్

చిక్కడపల్లి, జూలై 5 : నేటి పరిస్థితుల్లో ఆహార నియమాలు పాటించాలని హృదయ వైద్యనిపుణులు, హార్ట్ ట్రాన్స్‌ప్లాంట్, పద్మశ్రీ అవార్డు గ్రహీత డాక్టర్ ఏ గోపాలకృష్ణ గోఖలే అన్నారు. శారీరక వ్యాయామం తగ్గడం, ఒత్తిడి వలన చిన్నతనంలో హార్ట్‌స్ట్రోక్స్ వస్తున్నాయని తెలిపారు. బాగ్‌లింగంపల్లి సుందరయ్య పార్కులో శుక్రవారం వాకర్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సెంట్రల్ ఆధ్వర్యంలో మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ విచ్చేసి క్యాంప్ ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ గోపాల కృష్ణ గోఖలే మాట్లాడుతూ.. మితాహారం, వ్యాయామంతో శరీరం ఆరోగ్యంగా ఉంటుందన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో ఉండాలని, ఆరోగ్యంపై దృష్టి పెట్టాలని సూచించారు. అనంతరి డాక్టర్ గోఖలేను సన్మానించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వివేక్, వెంకట్ స్వామి గౌడ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు బబ్లూ, దామోదర్ రెడ్డి, మురళీ ప్రసాద్, కందూరి కృష్ణ పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న పోలీసులు

మూసీ నాలాలో పడిన వ్యక్తిని కుటుంబ సభ్యుడికి అప్పగిస్తున్న పోలీస్ ప్రదీప్

కాచిగూడ, జూలై 5 : మూసీ నాలాలో పడిన వ్యక్తిని కాపాడి కాచిగూడ పోలీసులు మానవత్వాన్ని చాటుకున్నారు. ఎస్సై హెచ్.నరేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. అంబర్‌పేటలోని చెన్నారెడ్డినగర్‌కు చెందిన సయ్యద్ అహ్మద్ కుమారుడు సాధిఖ్ శుక్రవారం ఉదయం కాచిగూడలోని వడ్డేర బస్తీ మూసీ నాలాలో మూత్ర విసర్జన చేస్తుండగా ప్రమాదవశాత్తు నాలాలో జారిపడ్డాడు. అక్కడి నుంచి శ్యామ్‌నగర్ మూసీ నాలా వరకు కొట్టుకుని వచ్చాడు. ఆ ప్రాంతంలో విధులు నిర్వహిస్తున్న కాచిగూడ బీసీ -3 పోలీసులు ప్రదీప్, సిద్దయ్య నాలాలో పడిన సాధిఖ్‌ను గమనించి, వెంటనే బయటకు తీసి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ సందర్భంగా ఎస్సై నరేశ్ బీసీ-3 ప్రదీప్, సిద్దయ్యను అభినందించారు.

వైద్యుల బదిలీల విషయంలో వివాదం

సుల్తాన్‌బజార్, జూలై 5 : వైద్య, ఆరోగ్య శాఖలో జరుగనున్న సాధారణ బదిలీల విషయంలో ఫెరిఫెరల్, టీజీడీఏ నాయకుల మధ్య జరుగుతున్న వివాదం శుక్రవారం తారా స్థాయికి చేరి తీవ్ర ఉద్రిక్త పరిస్థితులకు దారి తీసింది. బదిలీలలో ప్రధానంగా గుర్తింపు లేని టీజీజీడీఏ నాయకుల ప్రమేయం లేకుండా పారదర్శకంగా,ప్రభుత్వం ఇచ్చిన జీవోపై హర్షం వ్యక్తం చేస్తూ డీఎంఈ డాక్టర్ వాణిని కలిసేందుకు మెడికల్ కళాశాలలకు చెందిన వైద్యులతో కలిసి ఫెరిఫెరల్ డాక్టర్ వి.శేఖర్ అక్కడికి వస్తున్న తరుణంలో తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం ప్రతినిధులు డాక్టర్ బొంగు రమేశ్, డాక్టర్ పల్లం ప్రవీణ్‌కుమార్,డాక్టర్ లాలూ ప్రసాద్ రాథోడ్,డాక్టర్ వినోద్‌కుమార్ అడ్డుకున్నారు. కాగా బదిలీల విషయంలో వైద్యుల సంఘాల జోక్యం లేకపోవడంతో పాటు టీజీడీఏ సంఘానికి గుర్తింపు లేదని అనడం సరికాదని ఇరువర్గాల వైద్యుల మధ్య తోపులాట జరిగింది.

అప్సా టెక్ మహీంద్రా ఫౌండేషన్ స్మార్ట్ ట్రైనింగ్ సెంటర్ ఆధ్వర్యంలో శుక్రవారం రాం నగర్ ఈ సేవా వద్ద నిరుద్యోగులకు ఉచిత కంప్యూటర్ శిక్షణ, ఉపాధి అవకాశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఉచిత ఉపాధి నైపుణ్య కోర్సుల తీరును వివరించిన సంస్థ ప్రతినిధులు నిరుద్యోగుల నుంచి దరఖాస్తులు స్వీరించారు. కార్యక్రమంలో అప్సా ప్రాజెక్టు మేనేజర్ ప్రవీణ్ హజారే, బీఆర్ఎస్ నాయకులు నేత శ్రీనివాస్, మాధవ్, టక్కర్ శ్రీను, లూథర్, టీడీపీ నాయకుడు వెలిగి శంకర్ పాల్గొన్నారు.

- ముషీరాబాద్

శాంతినగర్, అశోక్‌నగర్, మారుతీనగర్ పాంతాల్లో డ్రైనేజీ సమస్యతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని స్థానికులు అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్‌కు ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్యే ఆదేశాలతో శుక్రవారం జలమండలి మేనేజర్ రోహిత్, బీఆర్ఎస్ నాయకుడు సంతోష్ వ్యర్థాలను శుభ్రం చేయించి సమస్య పరిష్కరించారు.

- గోల్నాక

తులసీరాంనగర్ లంకలో కొంత కాలంగా డ్రైనేజీ సమస్యతో ఇబ్బందులు పడుతున్నామని శుక్రవారం స్థానికులు కార్పొరేటర్ దూసరి లావణ్యగౌడ్ కు ఫిర్యాదు చేశారు. కార్పొరేటర్ ఆదేశాల మేరకు బీఆర్ఎస్ నాయకుడు దూసరి శ్రీనివాస్‌గౌడ్ అధికారులతో మాట్లాడారు. సమస్యను వెంటనే పరిష్కరించాలని అధికారులను కోరారు.

- గోల్నాక

ఆర్టీసీ బస్సులో ప్రసవించిన మహిళ

కాచిగూడ, జూలై 5: ఆర్టీసీ బస్సులో ఓ మహిళకు కాన్పుచేసి ముషీరాబాద్ డిపో సిబ్బంది మానవత్వాన్ని చాటుకున్నారు. ముషీరాబాద్ ఆర్టీసీ డిపో ఇన్‌చార్జి మేనేజర్ టి.రఘు తెలిపిన వివరాల ప్రకారం.. ఆరాంఘర్‌కు చెందిన శ్వేతారత్నంకు శుక్రవారం పురిటి నొప్పులు రావడంతో చార్మినార్ లోని ప్రభుత్వ దవాఖానకు అత్తతో కలిసి ఆర్టీసీ బస్సులో వెళ్తున్నది. బహదూర్‌పూర్ వద్దకు బస్సు రాగానే పురిటి నొప్పులతో భరించలేక పోవడం చూసిన ఆర్టీసీ కండక్టర్ సరోజ బస్సును నిలిపివేసి అందులో ఉన్న ప్యాసింజర్లు సహాయంతో తల్లి, బిడ్డకు ఇబ్బందులు తలెత్తకుండా బస్సులోనే శ్వేతా రత్నంనకు కాన్పు చేశారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం జడ్జి ఖాన దవాఖానకు తరలించారు. ప్రస్తుతం తల్లిబిడ్డలు క్షేమంగా ఉన్నట్లు డిపో మేనేజర్ టి.రఘు తెలిపారు. ఈ సందర్భంగా ముషీరాబాద్ ఆర్టీసీ డిపో ఇన్‌చార్జి మేనేజర్ రఘు, ప్రమాణికులు కండక్టర్, డ్రైవర్‌ను అభినందించారు.

కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

కార్వాన్, లంగర్‌హౌస్ డివిజన్‌లోని బాపూనగర్ మందులబస్తీలోని అంగన్ వాడీ కేంద్రాన్ని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి శుక్రవారం ఉదయం ఆకస్మికంగా తనిఖీ చేశారు. చిన్నారులకు అందుతున్న సౌకర్యాలను పరిశీలించారు. అంగన్‌వాడీలలో ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశించారు. బీజేపీ నాయకులు జెన్న సుధాకర్ లంగర్‌హౌస్‌లో జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని కలెక్టర్‌కు విన్నవించారు.

- మెహిదీపట్నం

అద్భుత సాహిత్య సృష్టికర్త ఇనాక్

అద్భుతమైన సాహిత్య సృష్టికర్త ఆచార్య కొలకలూరి ఇనాక్ అని ఎమ్మెల్సీ ఎస్.మధుసూదనాచారి అన్నారు. చిక్కడపల్లి త్యాగరాయగాన సభలో జరుగుతున్న పద్మశ్రీ కొలకలూరి ఇనాక్ సాహితీ సమాలోచన సప్తాహం కార్యక్రమంలో భాగంగా ఐదో రోజు ఇనాక్ నాటక సాహిత్యంపై ప్రసంగించారు. గాన సభ అధ్యక్షుడు వి.ఎస్. కళా జనార్దనమూర్తి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నాటక రచయిత పాటిబండ్ల ఆనందరావు, తెలంగాణ రచయిత సంఘం అధ్యక్షుడు నాళేశ్వరం శంకరం, చక్రపాణి, సి.హెచ్.వి. ప్రసాద్, మల్లాది ఉష పాల్గొన్నారు.

- ముషీరాబాద్

హోంగార్డులను సొంత రాష్ట్రానికి పంపించండి

తెలంగాణలో పనిచేస్తున్న ఏపీ రాష్ట్రానికి చెందిన హోంగార్డులను సొంత రాష్ట్రానికి పంపించాలని హోం గార్డు ప్రతినిధులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం ప్రొఫెసర్ కోదండరామ్‌కు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో హోంగార్డులు ఎస్.నారాయణరెడ్డి, శ్రీను, రంగారెడ్డి, లక్ష్మీ నారాయణ, మధు, లాజర్ పాల్గొన్నారు.

- కాచిగూడ

సన్మానం..

రవీంద్రభారతి, జూలై 5 : సాంస్కృతిక కళాబంధు సారిపల్లి కొండలరావు సహస్ర పూర్ణచంద్ర దర్శన మహోత్సవం రవీంద్రభారతిలో నిర్వహించారు. సామాజిక సేవా కార్యకర్తలు, యువకళావాహని సభ్యులు ఇందారం సంజయ్ భరద్వాజ్ శాలువాతో సారిపల్లిని సన్నానించారు. కార్యక్రమంలో త్యాగరాజు, జాన్ ఎడ్వార్డ్ పాల్గొన్నారు.

నేటి నుంచి 14 వరకు అనంతయ్య చిత్రాల ప్రదర్శన

చిత్రకారుడు అనంతయ్య కుంచె నుంచి జాలువారిన చిత్రాలతో కూడిన చిత్రకళా ప్రదర్శన జూలై 6న సాయంత్రం కావూరిహిల్స్‌లోని చిత్రమయి ఆర్ట్ గ్యాలరీలో ఉంటుందని నిర్వాహకులు శుక్రవారం తెలిపారు. ప్రభుత్వం నుంచి ఉత్తమ చిత్రకారుడు అవార్డు, తెలుగువర్సిటీ నుంచి ప్రతిభా పురస్కారం, హైదరాబాద్ ఆర్ట్ సొసైటీ నుంచి గోల్డ్‌మెడల్‌ను అనంతయ్య అందుకున్నారు. తెలంగాణ సారస్వత పరిషత్తు ప్రధాన కార్యదర్శి డాక్టర్ చెన్నయ్య, సీనియర్ జర్నలిస్టు ఉడయవర్లు, హైదరాబాద్ ఆర్ట్ సొసైటీ అధ్యక్షుడు రమణారెడ్డి ప్రదర్శనను ప్రారంభిస్తారని పేర్కొన్నారు. ప్రదర్శన ఈ నెల 14 వరకు కొనసాగుతుందని వెల్లడించారు.

- తెలుగు యూనివర్సిటీ

వ్యక్తి అదృశ్యం

కార్వాన్, జూలై 5 : ఓ వ్యక్తి కనిపించకుండా పోయిన ఘటన టప్పాచబుత్రా పీఎస్ పరిధిలో చోటు చేసుకున్నది. ఎస్సై అమ్జద్ షరీఫ్ తెలిపిన వివరాల ప్రకారం.. జిర్రాలోని బిలాల్ మసీదు ప్రాంతంలో నివసించే రజియాబేగంనకు ముగ్గురు కొడుకులు, కూతురు ఉన్నారు. ఈమె పెద్ద కొడుకు షేక్ ఆమేర్ బేకరీలో పని చేస్తున్నాడు. ఆమేర్ గత ఫిబ్రవరి 8న పనికి వెళ్తున్నానని వెళ్లి తిరిగి రాలేదు. ఎంత వెతికినా ఆచూకీ తెలువక పోవడంలో చివరకు కుటుంబ సభ్యుల సూచన మేరకు టప్పాచబుత్రా పోలీసులకు ఆమేర్ తల్లి లిఖిత పూర్వక ఫిర్యాదు చేసింది. వివరాలు ఎవరికైనా తెలిస్తే 8712660448, 87126 61271లో తెలుపగలరని పోలీసులు సూచించారు.

వేగం కాదు.. సేఫ్టీ ముఖ్యం

విద్యార్థులకు ట్రాఫిక్‌పై అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

చార్మినార్; జూలై 5 : వేగం కన్నా.. సేఫ్టీ ముఖ్యమని బేగంపేట్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ ఇన్‌స్పెక్టర్ రాంచందర్ తెలిపారు. శుక్రవారం పురానా హవేలి ప్రాంతంలోని ముకర్రం జాహ్ పాఠశాలలో విద్యార్థులు ట్రాఫిక్‌పై అవగాహన కల్పించారు. ఇన్‌స్పెక్టర్ రాంచందర్ మాట్లాడుతూ.. నగరంలో రాంగ్‌సైడ్ డ్రైవింగ్ చేసిన సుమారు 52338 వాహనదారులపై 2023లో కేసులు నమోదైనట్లు, ఇలాంటి కేసులు ప్రసుతం 86శాతం పెరిగినట్లు తెలిపారు. యుక్త వయస్సులో స్పీడ్‌గా వెళ్తు సరదాగా గడిపేందుకు ఇష్టపడతారని, దాని వెంట ప్రమాదాలు సైతం ఉంటాయనే విషయం గుర్తు ఉంచుకోవాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాకేశ్ వాధే, కార్యదర్శి లెఫ్టినెంట్ కల్నల్ అండియప్పన్, పాఠశాల రిజిస్ట్రార్ సయ్యద్ ముస్సైర్, మీర్‌చౌక్ ట్రాఫిక్ ఎస్సై అమర్నాథ్ రెడ్డి, మహ్మమద్ అయాన్, కృష్ణ పాల్గొన్నారు.

కౌలు రైతులకు సాయం అందించాలి

సమావేశంలో మాట్లాడుతున్న విస్సా కిరణ్‌కుమార్

చిక్కడపల్లి, జూలై 5 : కౌలు రైతులకు ప్రభుత్వం అన్నిరకాల సాయం అందించాలి పలువురు వక్తలు డిమాండ్ చేశారు. రైతు స్వరాజ్య వేదిక ఆధ్వర్యంలో శుక్రవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో కౌలు రైతుల గుర్తింపు, రైతు భరోసా పై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. వేదిక అధ్యక్షుడు కన్నెగంటి రవి, విస్సా కిరణ్‌కుమార్, బి.కొండల్ , సంగెపు బొర్రన్న మాట్లాడుతూ.. రైతు భరోసా అనేది పెట్టుబడి సాయం అని కౌలు రైతులు సొంత పెట్టుబడితో వ్యవసాయం చేస్తున్నారు కాబట్టి రైతు భరోసా సహాయాన్ని కౌలు రైతులకు కూడా అందించాలని కోరారు.

బీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు జి.రాంబాబు యాదవ్ జన్మదిన వేడుకలను బాగ్‌లింగంపల్లిలోని రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం నిర్వహించారు. కార్మికుల కోసం పని చేసే నాయకుడు రాంబాబు యాదవ్ అని కార్మిక నాయకులు అన్నారు. కార్యక్రమంలో మినిమం వేజ్ బోర్డు మాజీ చైర్మన్ నారాయణ, బీఆర్టీయూ ప్రధాన కార్యదర్శి వేముల మారయ్య, శివశంకర్, ధనకార్ణ చారి, కిరణ్, రవి, సాంబశివరావు, మారుతీరావు, చక్రవర్తి, మహేందర్ పాల్గొన్నారు.- చిక్కడపల్లి

కార్వాన్, జూలై 5 : స్వచ్ఛంద సంస్థలు ప్రభుత్వ పాఠశాలలకు తోడ్పాటు అందించాలని బీజేపీ నాయకుడు దేవర వంశీ అన్నారు. గుడిమల్కాపూర్‌లోని దేవల్ జాంసింగ్ ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలో టీచ్ ఫర్ చేంజ్ సంస్థ తో కలిసి పెగా సిస్టమ్స్ సంస్థ పలు ఆధునీకరణ పనులు చేపట్టింది. పది బాత్రూంల ఆధునీకరణ, రెండు నీటి ట్యాంకులు, తాగునీటి కోసం మినరల్ వాటర్ ప్లాంట్‌ను నిర్మించారు. శుక్రవారం సంస్థ ప్రతినిధులు, పాఠశాల యాజమాన్యం పిలుపు మేరకు ముఖ్య అతిథిగా పాల్గొన్న దేవర వంశీ ఆధునీకరించిన పనులను సంస్థ ప్రతినిధులతో కలిసి ప్రారంభించారు.

గోల్కొండ కోటలో నీటి ట్యాంకర్లు

మెహిదీపట్నం, జూలై 5 : ఆషాఢ బోనాలను జరుపుకోవడానికి గోల్కొండ కోటకు వచ్చే భక్తులకు నీటి సమస్యలు లేకుండా జలమండలి అధికారులు ట్యాంకర్లను ఏర్పాటు పనులను పూర్తి చేశారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా నీటి సరఫరా చేయడానికి కృషి చేస్తామని డీజీఎం జవహర్ అలీ, మేనేజర్ సాజిద్ అలీ పేర్కొన్నారు.

బోనాల పండుగకు అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పని చేయాలని అంబర్‌పేట సర్కిల్ డీసీ మారుతీ దివాకర్ సూచించారు. సర్కిల్ కార్యాలయంలో శుక్రవారం వాటర్‌వర్క్స్, జీహెచ్‌ఎంసీ ఎల్కట్టి సిటి, ఇంజనీరింగ్, ట్రాఫిక్, ట్రాన్స్‌కో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఇందులో బోనాల పండుగ, మొహర్రం పండుగల సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలను చర్చించారు. - అంబర్‌పేట

మెడికల్ కళాశాల వద్ద గంజాయి విక్రయాలు

సుల్తాన్‌బజార్, జూలై 5 : జూనియర్ వైద్యులకు గంజాయిని విక్రయిస్తున్న ఓ పాత నేరస్థుడిని తెలంగాణ రాష్ట్ర యాంటి నార్కోటిక్ బ్యూరో, సుల్తాన్‌బజార్ పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. సుల్తాన్‌బజార్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసాచారి తెలిపిన వివరాల ప్రకారం.. గంజాయి పెడ్లర్ సురేశ్ సింగ్ శుక్రవారం ఉదయం కోఠిలోని ఉస్మానియా మెడికల్ కళాశాల వద్ద జూనియర్ వైద్యులకు గంజాయిని విక్రయిస్తున్నట్లు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు తెలంగాణ రాష్ట్ర యాంటి నార్కోటిక్ బ్యూరో, సుల్తాన్‌బజార్ పోలీసులు దాడి చేసి విక్రయిస్తున్న గంజాయి పెడ్లర్ సురేశ్ సింగ్, గంజాయిని కొనుగోలు చేస్తున్న జూనియర్ వైద్యులు డాక్టర్ కె.మణికందన్, డాక్టర్ వి.అర విందన్‌ను అరెస్టు చేశారు. జూడాలకు పరీక్ష నిర్వహించగా పాజిటివ్ రావడంతో వారిపై కేసు నమోదు చేశారు. మెడికల్ కళాశాలలో ఇంకా ఎవరైనా గంజాయిని స్వీకరిస్తున్నారా.. అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. వారి వద్ద నుంచి 80 గ్రాముల గంజాయి, రెండు మొబైల్ ఫోన్స్‌లను స్వాధీనం చేసుకోవడం జరిగిందని అన్నారు. ఇద్దరు జూనియర్ డాక్టర్‌లతో పాటు గంజాయి పెడ్లర్ సురేశ్‌సింగ్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

అమావాస్య పూజలు

అమావాస్యను పురస్కరించుకొని పురానాపూల్, కార్వాన్ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో గోవుల పూజ అనంతరం జియాగూడ గోపి హోటల్ వద్ద అన్నదానం చేశారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన బీఆర్ఎస్ నాయకులు సంగం యాద శ్రీనివాస్ గుప్తా అన్న ప్రసాద వితరణ చేపట్టారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు తొడుపునూరి బాలరాజు గుప్తా,ప్రధాన కార్యదర్శి సురేశ్ గుప్తా, పాల్గొన్నారు.

- సుల్తాన్‌బజార్

ప్రతి ఒక్కరూ సేవాగుణాన్ని అలవర్చుకోవాలని చిక్కడపల్లి ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు సింగారపు రమేశ్ గుప్తా అన్నారు. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం వివేక్‌నగర్ శ్రీ ఆంజనేయ స్వామి ఆలయ సమీపంలో అన్నదానం చేశారు.

- చిక్కడపల్లి

గోశాలలో పూజలు

అమావాస్యను సందర్భంగా గోశాలలో పూజలు నిర్వహించారు. ఎంజీబీఎస్‌లోని గోశాలలో బజరంగ్‌సేన రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.ఆర్. లక్ష్మణ్‌రావు గోవులకు గ్రాసం తినిపించి పూజలు చేపట్టారు. యెర్రం శ్రీనివాస్, ఆర్ శ్రీకాంత్ నాని, రవికాంత్, సునీల్ అగర్వాల్, నరేశ్ రాజ్, రామేశ్వర్ మిశ్రా, ఆదిత్య ముదిరాజ్, విజయ్ ముదిరాజ్, తరుణ్, ధీరజ్ పాల్గొన్నారు.

- అబిడ్స్